ప్రజాశక్తి
మంగళవారం 13 ఫిబ్రవరి 2024 5
విజయనగరం



15న ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌ను ఈ నెల 15న నగరంలోని పూల్‌బాగ్‌లో గల శ్రీ చలపతి పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడేళ్ల తర్వాత ప్రత్యక్షంగా ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్ ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలల నుంచి 2022-23 సంవత్సరంలో మంజూరైన ప్రాజెక్టులను జిల్లా స్థాయి ప్రదర్శనకు తీసుకురావాలని సూచించారు. విద్యార్థి, గైడ్ టీచర్ ప్రాజెక్టుతో హాజరు కావాల్సి ఉంటుందని చెప్పారు. ఉమ్మడి విజయనగరం జిల్లా వేదికగా నిర్వహించే ఈ కార్యక్రమంలో 180 ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎస్‌సిఇఆర్‌టి, పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి ఎం.కృష్ణారావు తెలిపారు.

నేటి నుంచి టిడిపి శంఖారావం

- ప్రతి నియోజకవర్గంలోనూ సభలు
- నేడు పాలకొండ, కురుపాంలో..
- యువనేత లోకేష్ రాక
- కేడర్‌ను ఎన్నికలకు సిద్ధం చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపి యువనేత, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన శంఖారావం యాత్ర ఉమ్మడి జిల్లాలో మంగళవారం నుంచి సాగనుంది. పార్టీ కేడర్‌ను ఎన్నికలకు సిద్ధం చేయడమే లక్ష్యంగా సాగుతున్న ఈ యాత్రలో భాగంగా అన్ని నియోజకవర్గాల్లోను బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఈ సభల్లో లోకేష్ కీలక ప్రసంగం చేయనున్నారు. స్థానిక అపరిష్కృతంగా ఉన్న దీర్ఘకాలిక సమస్యలు, వైసిపి ఎమ్మెల్యేల వైఫల్యాలు, నెరవేరని హామీలపై ప్రసంగం చేయనున్నట్టు సమాచారం. దీనికి ముందే ఆయా నియోజకవర్గాల్లో పార్టీ ముఖ్యనేతల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారని సమాచారం. లోకేష్‌తోపాటు సంబంధిత పార్లమెంటరీ పార్టీ సమన్వయ కర్త, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, స్థానిక జనసేన నాయకులు కూడా మాట్లాడతారు. సభలో ప్రజలు, లేదా పార్టీ కార్యకర్తల నుంచి వచ్చిన వినతులను కూడా స్వీకరించనున్నారు. ప్రతి సభకు 20వేల నుంచి 25వేలకు తగ్గకుండా జనసమీకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సమాచారం. ఇందుకోసం ఆటోలు, వ్యాన్లు తదితర ప్రైవేటు వాహనాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో శంఖారావం యాత్రకు సంబంధించి అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు అడారి శ్రావణ్‌కుమార్ సమన్వయం చేస్తున్నారు. ఇటు విజయనగరంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు, పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నట్టు సమాచారం. ప్రతి గ్రామం నుంచీ కేడర్ కదిలే విధంగా ప్రయత్నం చేయాలని పార్టీ ఆదేశించినట్టు సమాచారం. శంఖారావం పేరుతో మొదలైన ఈ యాత్రలో పార్టీ నాయకులు, కేడర్‌లోని అలకలు, అసంతృప్తులు, గ్రూపులను పసిగట్టి, అటువంటి చోట పార్టీ పరంగా జాగ్రత్తలు తీసుకునేందుకు కూడా తెరవెనుక వ్యూహం ఉన్నట్టుగా సమాచారం. లోకేష్ దృష్టిలో పడేందుకు ఆశావహులంతా సభ జరిగిన ప్రాంతాలు, రహదారుల్లో భారీ ఫ్లెక్సీ కటౌట్లు ఏర్పాటు చేసుకుంటున్నారు.

కురుపాంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

ఇదీ శంఖారావం షెడ్యూల్

13న పార్వతీపురం మన్యం జిల్లాలో మధ్యాహ్నం పాలకొండ, సాయంత్రం కురుపాం నియోజక వర్గాల్లో సభలు జరుగుతాయి. 14న జిల్లా పార్వతీపురం, సాలూరు, విజయనగరం జిల్లా బొబ్బిలి నియోజకవర్గం బాడంగిలో సభలు ఏర్పాటు చేశారు. 15న ఎచ్చెర్ల, రాజాం, చీపురుపల్లి, 16న గజపతినగరం, విజయనగరం, నెల్లిమర్ల, 17న ఎస్.కోట నియోజకవర్గాల్లో శంఖారావం యాత్ర సాగుతుంది.

నేడు పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో సభలు

ఈనెల 13వ తేదీ ఉదయం శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గంలో సభ జరుగనుంది. అనంతరం మధ్యాహ్నం 2గంటలకు పాలకొండలోనూ, సాయంత్రం 5గంటలకు కురుపాంలోనూ సభలు జరుగుతాయి. పాలకొండ నుంచి వీరఘట్టం వెళ్లే రోడ్డులో మార్కెట్‌యార్డుకు సమీపంలోని ఖాళీ స్థలంలోనూ, కురుపాం నియోజకవర్గం గరుగుబిల్లి మండలం ఎర్రన్న గుడివద్ద బహిరంగ సభలు జరనున్నాయి. సభా ప్రాంగణాలను ఇప్పటికే ఆయా నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జులు, పార్లమెంటరీ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు పరిశీలించారు. సభా వేదికలు సిద్ధమయ్యాయి. నాయకులంతా జన సమీకరణలో నిమగ్నమయ్యారు.

16న కార్మిక సమ్మెను జయప్రదం చేయండి

కార్మిక సంఘాలు పిలుపు

కార్మిక సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 16న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ బంద్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపు నిచ్చారు. సోమవారం అమర్‌భవన్‌లో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్, ఐఎన్‌టియుసి నాయకులు మొదిలి శ్రీనివాసరావు, ఎఐఎఫ్‌టియు నాయకులు బెహరా శంకరరావు మాట్లాడారు. కేంద్రంలో బిజెపి కార్పొరేట్ మతతత్వ విధానాలను అమలు చేస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఈనెల 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ బంద్ నిర్వహించాలని జాయింట్ ఫ్లాట్ ఫారం ఆఫ్ క్రియేట్ యూనియన్స్, సంయుక్త కిషన్ మోర్చా అఖిల భారత స్థాయిలో నిర్ణయించాయని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో కార్మికులంతా సమ్మె చేయాలని, గ్రామాల్లో బంద్ చేపట్టాలని పిలుపునిచ్చారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధి అవకాశాలు మృగ్యమై పోయాయని, శ్రామికుల నిజవేతనాలు 20శాతం తగ్గిపోయాయని తెలిపారు. గత ఏడాది కార్పొరేట్లకు 2.14 లక్షల కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేయడం అన్యాయం అన్నారు స్విస్ బ్యాంకు నుండి నల్లధనాన్ని వెనక్కి తెచ్చి పేదవారి బ్యాంకు ఖాతాల్లో 15 లక్షల రూపాయలు డిపాజిట్ చేస్తామన్న మాటను పూర్తిగా మర్చిపోయారని అన్నారు. మోడీ విధానాల వల్ల మధ్యతరగతి ప్రజల జీవితాలు పూర్తిగా నాశనం అయ్యాయని అన్నారు కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి కనీస వేతనాలు నిర్ణయించే విధానానికి స్వస్తి పలికిందన్నారు అన్ని రంగాల్లోను కాంట్రాక్ట్ లేబర్ విధానం పెంచి శ్రమ దోపిడీకి గురిచేస్తోందన్నారు. కనీస వేతనం నెలకు 26 వేలు నిర్ణయించేందుకు బిజెపి ప్రభుత్వం అంగీకరించటం లేదన్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాల మతతత్వ ధోరణులకు నిరసనగా ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్ ర్యాలీలో రైతులు వ్యవసాయ కార్మికులు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ఎస్.గంగరాజు, బి.రమణ, ఆనంద్, పొడుగు రామకృష్ణ, ఎన్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : ఈ నెల 16న చేపట్టే రవాణా రంగ సమ్మెను విజయవంతం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక లారీ ఓనర్స్ యూనియన్ కార్యాలయంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. 16 మోటార్ వాహనాల బంద్ చేపట్టాలని తీర్మానించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి గోనా భాస్కరరావు, వైస్ ప్రెసిడెంట్ పులప శ్రీను, ఆటో యూనియన్ నాయకులు జయరాం, రామ్‌నాయుడు మాట్లాడుతూ సొంత కాళ్ల మీద బతుకుతున్న ట్రాన్స్‌పోర్టు కార్మికులను మోడీ, జగన్ ప్రభుత్వాలు దొంగ దెబ్బతీస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు.

విజయనగరం టౌన్ : 16న జరిగే రవాణా రంగ సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ కోరారు. సోమవారం రవాణా రంగ యజమానులు, డ్రైవర్లు, కార్మికుల సమస్యలపై ముద్రించిన కరపత్రాలను పట్టణంలో పలు ఆటోస్టాండ్ల వద్ద పంపిణీ చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ దొర, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న జమ్మాన ప్రసన్నకుమార్

17న టిడ్కో ఇళ్లు పంపిణీ

ఎపి టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరంలోని సోనియా నగర్ పరిధిలో నిర్మించిన టిడ్కో ఇళ్లను సోమవారం ఎపి టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ పరిశీలించారు. ఈనెల 17న ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఉమ్మడి విజయనగరం జిల్లా సాలూరులో 1056 గృహాలు, విజయనగరం సారిపల్లిలో 1088 గృహాలు మొత్తంగా 2144 గృహాలను మంత్రులు బొత్స సత్యనారాయణ, పీడిక రాజన్న దొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేయనున్నారు. ఈ నేపథ్యంలో గృహ సముదాయాలలో జరుగుతున్న నిర్మాణ పనులను ఇంజినీరింగ్, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసేందుకు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టిడ్కో సూపరింటెండింగ్ ఇంజినీర్ డి.నరసింహమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జ్యోతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌లు, మున్సిపల్ కమిషనర్ ఎం.ఎం.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జెకెసికి 201 వినతులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జగనన్నకు చెబుదాం (జెకెసి)లో వివిధ సమస్యలపై ప్రభుత్వ శాఖలకు ప్రజల నుంచి అందిన వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. ఆయా ప్రభుత్వ శాఖలు తమకు సంబంధించి ఆన్‌లైన్‌లో పంపిన వినతులను పరిశీలించి, వాటిపై స్పందించాలన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో జెసి కె.కార్తీక్, డిఆర్‌ఒ ఎస్.డి.అనిత, కెఆర్‌ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ సుమబాల, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకర్‌రావుతో కలిసి జిల్లా కలెక్టర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 201 వినతులు అందాయి. రెవెన్యూ శాఖ సమస్యలపై 144 , డిఆర్‌డిఎకు 6, గ్రామ, వార్డు సచివాలయాల శాఖకు 11, జిల్లా పంచాయతీ విభాగానికి 15, గృహనిర్మాణ శాఖకు 5, జిల్లా ఆసుపత్రులకు సంబంధించి 3, ఎపి విద్యుత్ పంపిణీ సంస్థకు సంబంధించి 3 వినతులు, మున్సిపల్ శాఖకు 12 చొప్పున వినతులు అందాయి.

నిబంధనల మేరకు మినహాయింపులు

ఎన్నికల విధుల నుంచి ఎవరిని మినహాయించాలో ఎన్నికల విభాగం వారు నిర్ణయిస్తారని కలెక్టర్ నాగలక్ష్మి స్పష్టంచేశారు. వాస్తవ పరిస్థితులను మాత్రమే మినహాయింపులకు తీసుకుంటారని తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం అనంతరం అధికారులతో ఆమె మాట్లాడారు. చాలామంది అధికారులు ఎన్నికల విధుల నుండి మినహాయింపులు కోరారని తెలిపారు. రెగ్యులర్‌గా విధులకు హాజరవుతున్న వారిని వారి వాస్తవ పరిస్థితి ఆధారంగా మినహాయిస్తారని చెప్పారు. బాలింతలను 3 నెలల వరకు , వికలాంగులకు 75 శాతం పైబడిన వారికీ మినహాయిస్తారని తెలిపారు. రిటైర్మెంట్‌కు 3 నెలల తర్వాత వారికీ మినహాయింపు ఉండదని, జూన్ 30 లోపు రిటైర్ అయ్యే వారికే ఎన్నికల విధుల నుండి మినహాయిస్తామని తేల్చిచెప్పారు. వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల నియామకానికి మార్చి 31 లోపు నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ నెలాఖరు లోపు అన్ని శాఖల్లో ఉన్న ఖాళీల వివరాలను తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.

ఇళ్లు ఇవ్వకుండానే రుణాలు వసూలు అన్యాయం

'మాకు టిడ్కో ఇళ్లు ఇవ్వకుండానే బ్యాంకులు మా దగ్గర నుంచి రుణాలు వసూలు చేయడం అన్యాయం. బ్యాంకుల నుంచి రుణ విముక్తి కల్పించండి' అంటూ నెల్లిమర్లలోని నాయుడు కాలనీకి చెందిన కొత్తకోట్ల వసంతకుమారి, కలిశెట్టి చంద్రమ్మ అధికారులను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పలువురు తమ సమస్యలపై వినతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు హయాంలో తమకు ఇళ్ల అనుమతులు వచ్చాయని, అందుకు కొంత మొత్తం కట్టామని తెలిపారు. జగన్ అధికారంలోకి వచ్చాక ఆర్‌పిలు తమను మీటింగ్‌కు తీసుకెళ్లి సంతకాలు పెట్టించుకున్నారని, అప్పటి నుంచి తమ బ్యాంకు ఖాతాల నుంచి నెలకు రూ. 2950 కోత పెడుతున్నారని తెలిపారు. తమకు ఇల్లు రాకపోగా, వాడుకోకుండానే రూ.3.50లక్షలకు వడ్డీ కట్టడం ఏమిటని ప్రశ్నించారు. తమకు ఇళ్లు వద్దని, తాము కట్టిన డబ్బులు ఇప్పించాలని కోరారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

నా భూమి నాకు అప్పచెప్పండి

విజయనగరం మండలం చెల్లూరు గ్రామానికి చెందిన కోరాడ పైడిరాజు.. తన భూమిని అన్యాయంగా అక్రమణ చేసి రిజిస్ట్రేషన్ చేసేశారని, ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి వారి నుంచి తన భూమిని తనకు ఇప్పించాలని అధికారులను కోరాడు.

- నగరంలోని బొగ్గులదిబ్బ ఎస్‌సి కాలనీలో ఇళ్లు తొలగించిన బాధితులకు న్యాయం చేయాలని కోరారు. విజయనగరం మండలం జొన్నవలసలో బిసి బాలుర వసతి గృహంలో సమస్యలు పరిష్కరించాలని టిడిపి నాయకులు కలెక్టర్‌ను కోరారు. వినతినిచ్చిన వారిలో ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, రాష్ట్ర బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, కనకల మురళీమోహన్, ముద్దాడ చంద్రశేఖర్, విజ్జపు ప్రసాద్ తదితరులు ఉన్నారు.

డివిజిని కలిసిన చినగదిలి గిరిజనులు

విజయనగరం : విశాఖపట్నం జిల్లా చిన్నగదిలి మండలం సింహాచలం కొండపై నివసిస్తున్న గిరిజనులు, ప్రజా సంఘ నాయకులు సోమవారం విజయనగరంలో ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావును కలిసి తమ సమస్యలపై వినతి అందజేశారు. సింహాచలం దేవస్థానం అధికారులు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని,ప్రభుత్వ పథకాలు అందకుండా చేస్తున్నారని, విద్యుత్ బిల్లులు కూడా ఇవ్వకుండా చేస్తున్నారని విన్నవించారు. తాము ఎన్నో ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నప్పటికీ తమ ఇళ్ల మరమ్మత్తులు చేపట్టేందుకు కూడా అనుమతించడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ శంకర రావు మాట్లాడుతూ మీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు.

నేడు మంత్రి బొత్స రాక

విజయనగరం : రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. మంత్రి విజయవాడ నుంచి ఉదయం 10.30 గంటలకు నగరానికి చేరుకొని జెఎన్‌టియు.- జివిలో బాలికల హాస్టల్ భవనం, సివిల్, మెటలార్జికల్ భవనాల ప్రారంభోత్సం, వైస్ ఛాన్సలర్ లాంజ్ శంకుస్థాపన కార్యక్ర మంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు నగరంలోని తన నివాసానికి చేరు కుంటారు. మధ్యాహ్నం 3 గంటలకు బయలు దేరి విశాఖ చేరుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డితో ఆడుదాం ఆంధ్ర ముగింపు కార్యక్రమంలో పాల్గొంటారు.

రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

పెండింగ్ దరఖాస్తులపై దృష్టి పెట్టండి : జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్

ప్రజాశక్తి-విజయనగరం

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద ఇచ్చిన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లను త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ఆదేశించారు. ఎన్‌పిఐ రిజిస్ట్రేషన్లు, కుల గణణ, ఆడుదాం ఆంధ్ర యుసిల సమర్పణ, ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, యాప్ డౌన్‌లోడ్, రీసర్వే, స్టోన్ ప్లాంటేషన్, గృహనిర్మాణం తదితర అంశాలపై వివిధ మండలాల ప్రగతిని సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జెసి కార్తీక్

ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, ఎన్‌పిఐ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సచివాలయాలు లేని చిన్నచిన్న గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ద్వారా రిజిస్ట్రేషన్లు చేయించాలన్నారు. రీ సర్వేకు సంబంధించి తాహశీల్దార్లు తమకు వచ్చిన దరఖాస్తులను ఒక్కరోజులోనే క్లియర్ చేయాలన్నారు. సర్వే రాళ్ల పాతే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు కోసం వచ్చే దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని, ముఖ్యంగా రోజులతరబడి ఉండిపోయిన పెండింగ్ దరఖాస్తులపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆడుదాం ఆంధ్రా క్రీడల నిర్వహణకు సంబంధించి తక్షణమే యుసిలను పంపించాలని ఆదేశించారు. గృహనిర్మాణ కార్యక్రమంలో భాగంగా మెగా కంప్లీషన్ డ్రైవ్ లక్ష్యాన్ని చేరుకొనేందుకు ప్రతీఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఒ పి.బాలాజీ, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు, సచివాలయాల స్పెషల్ ఆఫీసర్ నిర్మలాదేవి, సర్వే ఎడి త్రివిక్రమరావు, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ ఉమాశంకర్, ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి, ఎపిఎంఐపి పీడీ లక్ష్మీనారాయణ, ఆర్‌డిఓలు, ఇఆర్‌ఒలు, మండల ప్రత్యేకాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మరోసారి చర్చలు విఫలం

పోరాటాన్ని ఉధృతం చేస్తామన్న మిమ్స్ ఉద్యోగులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి జరిగిన చర్చలు విఫలమయ్యాయి. సోమవారం డిఎస్‌పి ఆర్.గోవిందరావు సమక్షంలో మిమ్స్ యాజమాన్యానికి, మిమ్స్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ నాయకులు, ఉద్యోగుల మధ్య చర్చలు జరిగాయి. మిమ్స్ యాజమాన్యం పాత పాటే పాడింది. అన్ని అమలు చేశామని, ఇంకా ఏమైనా ఉంటే యూనియన్ నాయకులతో చర్చించబోమని, ఉద్యోగులతోనే మాట్లాడుతామని పట్టుబట్టింది. మిమ్స్ ఉద్యోగులు మాత్రం యాజమాన్యం అబద్ధాలు చెబుతోందని, తమకు ఎటువంటి డిఎలు ఇవ్వలేదని, వేతనాలు కూడా పెంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు లేకుండా చర్చల ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. మిమ్స్ యాజమాన్యం మొండి వైఖరిపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ తడాఖా ఏమిటో చూపించి మంగళవారం నుంచి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ చర్చల్లో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, మిమ్స్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.వి.రమణ, ఉద్యోగులు నారాయణ రావు మూర్తి, మధు, యాజమాన్యం తరపున డీన్, సూపరింటెండెంట్, ఎఒ, హెచ్ఆర్ పాల్గొన్నారు.

అప్రెంటీస్ విధానాన్ని రద్దుచేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో ప్రభుత్వం అమలు చేయనున్న అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి డిమాండ్ చేశారు. అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సోమవారం సాయంత్రం గాంధీ బొమ్మ వద్ద జీవో ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ డిఎస్‌సి నోటిఫికేషన్‌లో అప్రెంటీస్ విధానాన్ని అమలు చేస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. తక్షణమే అప్రంటీస్ విధానాన్ని రద్దు చేసి మెగా డిఎస్‌సి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, రామకృష్ణ, వరప్రసాద్, కృష్ణదాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

చిరుధాన్యాల ఆహారం.. ఆరోగ్యకరం

గిరిజన యూనివర్సిటీ విసి కట్టమణి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చిరుధాన్యాల ఆహారం ఆరోగ్యానికి మేలని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ టివి కట్టమణి తెలిపారు. సిటియులో సోమవారం చిరుధాన్యాల సాగుపై రైతులకు, వాటి వినియోగంపై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కట్టిమణి మాట్లడుతూ చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవడం ద్వారా జీవన విధానం తక్కువ ఖర్చు తో మెరుగుపడుతుందని అన్నారు. చిరుధాన్యాల ఉత్పత్తి చేస్తున్న రైతులకు ప్రోత్సాహం కలుగుతుందని అన్నారు. మరో అతిథి డిఎఫ్ఒ కె.జానకిరావు మాట్లాడుతూ కార్యక్రమములో కె . జానకి రావు డివిజనల్ ఫారెస్ట్ అధికారి (సామాజిక అడవులు) మాట్లడుతూ బయో డైవర్సిటీ ద్వారా గల ప్రయోజనాలను, మిల్లెట్ ఉపయోగాలను వివరించారు. ఆరోగ్య మిల్లెట్ సిఇఒ సరస్వతి మాట్లాడుతూ మిల్లెట్స్ ను ఆహారం వివిధ పద్ధతులలో తయారు చేసుకొని ఉపయోగించ వచ్చునని తెలిపారు. మిల్లెట్ సిస్టర్స్ ఎఫ్‌పిఒ కార్యదర్శి కె.జోగినాయుడు మాట్లాడుతూ వివిధ రకాల మిల్లెట్స్ వారి లభ్యత, ఉపయోగాలను వివరించారు. ఆరోగ్యం వ్యవస్థాపకులు డివి. కృష్ణారెడ్డి మాట్లాడుతూ మిల్లెట్స్ వినియోగం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సిటియు రిజిస్ట్రార్, డీన్‌లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్పందన ఫిర్యాదు దారులకు తక్షణ న్యాయం చేయాలని పోలీసు అధికారులను జిల్లా అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందనలో భాగంగా సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వారి సమస్యలు తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా 41 ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో విజయనగరం డిఎస్‌పి ఆర్.గోవిందరావు, డిసిఆర్‌బి సిఐ జె.మురళి, ఎస్‌బి సిఐలు కెకెవి విజయనాథ్, ఇ.నర్సింహమూర్తి, టాస్క్‌ఫోర్సు సిఐ కె.అశోక్‌కుమార్, ఎస్‌ఐ ప్రభావతి పాల్గొన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎఎస్‌పి అస్మా ఫర్హీన్

జిసిసి కార్మికులకు పూర్తి పని దినాలు కల్పించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం జిసిసి సోప్ యూనిట్‌లో కార్మికులకు పూర్తి పనిదినాలు కల్పించాలని జిసిసి సోపు యూనిట్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు ఎ.జగన్ మోహన్‌రావు, అధ్యక్ష, కార్యదర్శులు సంతు, సుశీల కోరారు. ఈ మేరకు సోమవారం జిసిసి చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి , ఎమ్‌డి జి.సురేష్ కుమార్‌ని కలిసి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు 15 రోజులకు మించి పని కల్పించడం లేదన్నారు. ఇఎస్‌ఐ అర్హత కూడా కోల్పోతామని చెప్పారు. వచ్చే రూ.4 వేలు వేతనంతో కుటుంబాన్ని ఏ విధంగా పోషించుకోవాలని, అది కూడా నెలాఖరికి ఇస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఏడాది కాలంగా పని సక్రమంగా ఉండడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. జీతం చెల్లించాలని అడిగితే మూసేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. దీనిపై చైర్‌పర్సన్ స్వాతీరాణి స్పందిస్తూ పనిదినాల పెంపునకు, జీతాల సకాలంలో చెల్లించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. వారం రోజుల్లో సోపు యూనిట్‌ను సందర్శిస్తానని, స్థానిక సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. ప్రభుత్వ వసతిగృహాలకు జిసిసి సబ్బుల పంపిణీకి ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఆర్డర్ వస్తే పూర్తిస్థాయిలో పని కల్పిస్తామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో శేషు, భారతి, రమణమ్మ, సూర్యనారాయణ , లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జిసిసి చైర్‌పర్సన్‌కు వినతి అందిస్తున్న సోప్ యూనిట్ కార్మికులు

ఆర్ఒబిపై నిలిచిన లారీ

స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక రైల్వే ఫ్లైఓవర్‌పై సోమవారం అధిక లోడుతో వెళ్తున్న లారీ నిలిచిపోయింది. బ్రిడ్జి మధ్యలో లారీ నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఫ్లైఓవర్‌పై, ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ట్రాఫిక్ స్తంభించడంతో రాకపోకలకు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ పోలీసులు కలుగజేసుకుని వాహనాలను నియంత్రించారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

బ్రిడ్జిపై నిలిచిన వాహనాలు

మార్గరేట్‌కు పిహెచ్‌డి

ప్రజాశక్తి-విజయనగరం

విశ్రాంత హౌసింగ్ పీడీ దేవుపల్లి ప్రిన్స్ మార్గరేట్‌కు పిహెచ్‌డి పట్టా లభించింది. ఆంధ్ర ప్రదేశ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ నుంచి ఆమె డాక్టరేట్ అందుకున్నారు. బ్రదర్ పి. సామ్యూల్ జాక్ ఫెలెక్స్ గైడెన్స్ లో, బైబిల్ లో స్త్రీల పాత్ర, క్రైస్తవ సంఘ చరిత్ర అన్న అంశాలపై ఆమె చేసిన పరిశోధనా పత్రాలకు ఈ అవార్డు లభించింది. పిహెచ్‌డి అందుకున్న మార్గరేట్ ను పలువురు అభినందించారు.

నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం

నూతన భవనం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఎత్తు బ్రిడ్జి డౌన్‌లో వైజాగ్ వెళ్లే మార్గంలో ఎపి రాష్ట్ర ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం సామాజిక భవనాన్ని సోమవారం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించారు. రూ.16.50 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించారు. కార్యక్రమంలో కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, డ్రైవర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-గుర్ల

మండలంలో తెట్టంగి గ్రామంలో సోమవారం కోటగండ్రేడు చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో విజన్ స్ప్రింగ్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని బిసి సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వెన్నె సన్యాసినాయుడు ప్రారంభించారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని విజయనగరం సర్వజన ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో వంద మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోటగండ్రేడు చేనేత సహకార సంఘం మాజీ డైరెక్టర్ తూటా నాగరాజు, ఐటిడిపి చీపురుపల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ నాగులపల్లి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

డి- పట్టా భూములను క్రమబద్ధీకరించాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

డి-పట్టా భూములను క్రమబద్ధీకరణ చేయాలని రైతులు కోరుతున్నారు. సోమవారం ఎపి రైతు సంఘం నాయకులు కె.రామారావు ఈ సమస్యను తహశీల్దారు దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ అధికారులు ఇటీవల 20 ఏళ్లు దాటిన డి-పట్టా భూముల క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారని తెలిపారు. వాటిలో కొంత మందికి క్రమబద్ధీకరణ ఆన్‌లైన్ రాలేదని వివరించారు. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి మిగిలిన డి పట్టా భూములను క్రమబద్ధీకరణ చేయాలని కోరారు.



గ్రామాల్లో ప్రచారం చేస్తున్న వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజేష్

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-రేగిడి

రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందించే ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిదేనని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలే రాజేష్ అన్నారు.. సోమవారం రేగిడి, ఆమదాలవలస, లింగాల వలస, సోమరాజు పేట, వావిలవలస తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. గ్రామస్థాయి నాయకులను మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. వీరితో వైస్ ఎంపిపి వావిలపల్లి జగన్మోహనరావు, టంకాల అచ్చెంనాయుడు, వైసిపి నాయకులు గౌరి నాయుడు, రమేష్ నాయుడు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

అందరికీ పరిశుభ్రతపై అవగాహన ఉండాలని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని సీతారామునిపేట కళ్యాణ మండపంలో స్ఫూర్తి సేవా సాధన సంస్థ ఆధ్వర్యంలో హెల్త్ ఎన్విరాన్‌మెంట్ కేర్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఇంటి వద్దనే ఆకుకూరలు, కూరగాయల పండించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ స్టీఫెన్ పాల్ పాల్గొన్నారు.

'నా భూమి-నా హక్కు-నా ఇష్టం' బుక్‌లెట్లు అందజేత

ప్రజాశక్తి-శంగవరపుకోట

నా భూమి-నా హక్కు-నా ఇష్టం బుక్‌లెట్లను స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లు సత్యాజీ న్యాయవాదులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీరింగ్ కమిటీ సభ్యులు పతివాడ వెంకట గిరిధర్ రచించిన బుక్‌లెట్ ప్రతి ఒక్కరికి ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి డబ్ల్యు.ఎన్.శర్మ, సీనియర్ న్యాయవాదులు మండా కామేశ్వరరావు, వారాది ఈశ్వరరావు, బోని శేఖర్ బాబు, బొబ్బిలి రామకృష్ణ, ఎస్.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి-బొబ్బిలి

విధులు సక్రమంగా నిర్వహించని వాలంటీర్‌పై చర్యలు తీసుకోవాలని హుదా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మహమ్మద్ రఫీ కోరారు. కోరాడవీధి వాలంటీర్‌పై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. రేషన్ సరుకులు ఇంటింటికి ఇవ్వడం లేదని, ప్రతినెలా ఎండియు వాహనంతో రేషన్ అందజేయాలని కోరారు.

జెజెఎం పనులపై సర్వే

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని గోపాలవలస పంచాయతీ జగన్నాథవలసకు జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీరు పథకానికి ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ శ్రీనివాస్ సోమవారం సర్వే చేపట్టారు. జెజెఎం నిధులు రూ.67 లక్షలు మంజూరు కావడంతో పైపులైను వేసేందుకు వీధులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో జలసంఘం ఏర్పాటుచేసి, పనుల విధివిధానాలను సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు జి.వెంకట్రావు, ఇంజనీర్ అసిస్టెంట్ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి మోహన్ పాల్గొన్నారు.

నేడు మార్కెట్ ఆశీల వేలం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2024 - 25 ఆర్థిక సంవత్సరానికి నగరంలో మార్కెట్ ఆశీలు బహిరంగ వేలం పాటను ఈనెల 13వ తేదీ ఉదయం 11 గంటలకు నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థకు సంబంధించిన మార్కెట్ ఆశీలు వసూలు లీజు గుత్త హక్కుల కోసం చేపట్టవలసిన బహిరంగ వేలంపాటను గనెల 31న నిర్వహించవలసినప్పటికీ పరిపాలన సంబంధమైన కారణాల రీత్యా వాయిదా పడిందని తెలిపారు. ఆసక్తిగల పాటదారులు వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

వైసిపికి షాక్

టిడిపిలో చేరేందుకు సిద్ధమవుతున్న అవనాపు, పిల్లా!

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం నియోజకవర్గంలో అధికార పార్టీలో భారీ కుదుపు... వైసిపికి ఎన్నికల ముందు గట్టిదెబ్బ తగిలింది. వైసిపి ఆవిర్భావం నుంచీ నియోజకవర్గంలో సేవలందిస్తున్న కుటుంబానికి చెందిన నాయకుడితోపాటు సీనియర్ నేతలు మరో ఇద్దరు అధికార పార్టీకి గుడ్‌బై చెబుతున్నారు. తమకు ప్రాధాన్యత దక్కడం లేదన్న కారణంతోనే వారు పార్టీని వీడుతున్నట్లు తెలిసింది. వైసిపి సీనియర్ నాయకులు పిల్లా విజయకుమార్, యువజన విభాగం సీనియర్ నాయకులు అవనాపు విజయ్, మాజీ కౌన్సిలర్ గాడు అప్పారావు.. వైసిపికి గుడ్ బై చెబుతున్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ అనుచరులుగా ఉంటూ... గతంలో కాంగ్రెస్ పార్టీకి, తర్వాత వైసిపికి జిల్లా కేంద్రంలో అనేక ఏళ్లుగా సేవలందించారు. రాష్ట్ర నాయకుల వద్ద మంచి గుర్తింపు ఉన్న నాయకులు వైసిపిని వీడటం పార్టీకి నష్టం కలిగించే అంశం.

జిల్లాలో వైసిపి జెండా మొదట పట్టుకున్నది అవనాపు కుటుంబమే. అటువంటి కుటుంబం నుంచి విజయనగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పనిచేసి, ప్రస్తుతం యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న వ్యక్తి అవనాపు విజయ్. మంత్రి బొత్స సత్యనారాయణ అనుచరులుగా ఉన్న మరో సీనియర్ నాయకుడు.. పిల్లా విజయకుమార్. ఇప్పటికే నాగవంశం వార్డులో కౌన్సిలర్‌గా చేసిన వ్యక్తి గాడు అప్పారావు. వైసిపిలో వీరి ముగ్గురికి సముచిత స్థానం ఇవ్వకపోవడంతో చాలా ఏళ్లుగా అసంతృప్తితో ఉన్నారు. ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి పార్టీలో చేరినప్పటి నుంచి వీరికి సరైన గుర్తింపు లేకుండా పోయింది. బొత్స గ్రూపుగా ఈ ఐదేళ్లు ఉన్నా మంత్రి బొత్స, వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు వీరికి సరైన గుర్తింపు లేకుండా చేయడంతో వారు పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారు అనేక కార్యక్రమాలు నిర్వహించారు. అయినా మజ్జి శ్రీనివాసరావు కూడా కనీసం గుర్తింపు ఇచ్చే ప్రయత్నం చేయకపోవడంతో ఎన్నేళ్లు ఉన్నా, ఎంత సేవ చేసినా ఫలితం లేకపోవడంతో లేకపోవడంతో పార్టీని వీడేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. కోలగట్ల నాయకత్వంలో పనిచెయ్యలేక, బొత్స అనుచరులుగా ఉంటూ విజయనగరం నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ బిసిలకు ఇవ్వాలని అనేక ఆందోళనలు చేసి, మంత్రులు, అధిష్టానాన్ని కలిసి విన్నవించారు. దీంతో జిల్లా నాయకులతో వీరికి మరింత దూరం పెరిగింది. స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరిని పూర్తిగా దూరం పెట్టారు. దీంతో కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు సైతం దూరంగా ఉంటూ వస్తున్నారు. మంగళవారం వైసిపిని వారు వీడనున్నట్లు ప్రకటించే అవకాశముంది.

పిల్లా విజయకుమార్

అవనాపు విజయ్



గాడు అప్పారావు

19న టిడిపిలో చేరిక?

పిల్లా విజయకుమార్, అవనాపు విజయ్, మాజీ కౌన్సిలర్ గాడు అప్పారావు.. మరికొంతమందితో కలిసి టిడిపిలో చేరనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ ఏడాది ఆరంభంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజును అవనాపు విజయ్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అప్పుడు టిడిపిలో చేరుతారా? అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. మంగళవారం రాజీనామా చేశాక, టిడిపిలో చేరేందుకు ప్రకటన రానుండటంతో అనుమానాలకు తెరపడనుంది. ఇప్పటికే టిడిపి నాయకులను కలిసి ఈ నెల 19న టిడిపిలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. వారి వెంట మరికొంతమంది నాయకులు కూడా టిడిపిలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. ఇదే జరిగితే విజయనగరం నియోజకవర్గంలో వైసిపికి గట్టి షాక్ తగిలే అవకాశముంది.

రైతుబజార్, సంత నిర్వహణకు తీర్మానం

ఎఎంసి సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

మార్కెట్ యార్డులో రైతు బజార్, ప్రతి బుధవారం వారపు సంత నిర్వహించేందుకు ఎఎంసి ఏకగ్రీవంగా తీర్మానించింది. ఎఎంసి కార్యాలయంలో సోమవారం చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. బొబ్బిలిలో రైతు బజారుకు స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులను కోరిన స్థలం కేటాయించలేదని, మార్కెట్ యార్డులో రైతు బజార్ నిర్వహణకు తీర్మానించారు. బొబ్బిలిలో ప్రతి బుధవారం జరిగే వారపు సంత కరోనా లాక్‌డౌన్ నుంచి నిలిచిపోవడంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మార్కెట్ యార్డులో సంత నిర్వహణకు తీర్మానించారు. తెర్లాంలో రెండు, డొంకినవలసలో ఒకటి, బొబ్బిలిలో ఒకటి చొప్పున గోదాముల నిర్మాణానికి రూ.2.40కోట్లతో ప్రతిపాదనలు చేశామని చైర్మన్ తెలిపారు. పాత గోదాములను బాగు చేసేందుకు రూ.కోటితో ప్రతిపాదనలు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే ఎఎంసి ఆదాయం బ్యాంకులో రూ.8.80 కోట్లు ఉందన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి పౌర సరఫరాల శాఖ నుంచి రూ.2 కోట్లు సెస్ రావాల్సి ఉందన్నారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ తెంటు పార్వతి, సెక్రటరీ కె.ఈశ్వరరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ

శంఖారావాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి- జామి

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈ నెల 17న సోంపురం జంక్షన్ లేఔట్ లో నిర్వహించే శంఖారావం సభను విజయవంతం చేయాలని ఎస్.కోట నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి కోళ్ల లలితకుమారి, రాష్ట్ర నాయకులు రాంప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం జామి మండల కేంద్రంలో 13 గ్రామాల నాయకుల తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్.కోట నియోజకవర్గం టిడిపికి అడ్డా అనే విధంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని పేర్కొన్నారు. జామి మండలం, ప్రతీ గ్రామం నుండి పెద్దఎత్తున జనం తరలించేలా ఏర్పాట్లు చేయాలని కేడర్‌కు సూచించారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తుందని, ప్రతి ఒక్కరూ అకుంటిత దీక్షతో కష్టపడి పని చేయాలని పిలుపనిచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బండారు పెదబాబు, వర్రి రమణ, శ్రీలక్ష్మి, శ్రీను, అప్పలనాయుడు, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొండపల్లి : ఈ నెల 16న గంట్యాడ మండలంలో జరిగే టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావ సభకు భారీగా తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ కోరారు. సోమవారం గజపతినగరంలోని టిడిపి కార్యాలయంలో దత్తిరాజేరు మండల టిడిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలకు జాబ్ కేలండర్ లేదని, ఉద్యోగాలను కూడా భర్తీ చేయలేని స్థితిలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఉన్నారని తెలిపారు. నాశిరకం మద్యంతో వేలాదిమంది ప్రాణాలు తీస్తున్నారని చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరలు, ఆర్‌టిసి ఛార్జీలు, ఇంటి పన్ను, విద్యుత్తు ఛార్జీలు పెంచడంతోపాటు చెత్త మీద కూడా పన్ను వేసిన వైసిపి ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. గతంలో లోకేష్ చేసిన యువగళం పాదయాత్రతోనే వైసిపి పతనం ప్రారంభమైందని చెప్పారు. సమావేశంలో సర్పంచ్ రామకృష్ణ, మాజీ సర్పంచులు గిరిజాల సూర్యనారాయణ, మురపాక జ్యోతి, గాడి కృష్ణ, రమణ, మిత్తిరెడ్డి హైమావతి, శేఖర్, సాంబ, గొర్లకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ధరల భారం

ప్రజాశక్తి-విజయనగరం కోట

వైసిపి ప్రభుత్వ పాలనలో ప్రజలపై నిత్యావసర ధరలతో పాటు అనేక భారాలు పడ్డాయని టిడిపి విజయనగరం నియోజకర్గ ఇన్‌ఛార్జి పి.అదితి గజపతి అన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా 30వ డివిజన్ ధర్మపురిలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు, రాష్ట్రాన్ని కాపాడాలంటే తెలుగుదేశం - జనసేన ప్రభుత్వం ఏర్పడాలని, అందుకు ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతుందని, పాదయాత్రలో హామీలు ఇచ్చి జగన్ మడమ తిప్పారని అన్నారు. ఎల్లప్పుడూ బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉండే తెలుగుదేశం పార్టీ ని గెలిపించి చంద్రబాబు నాయుడు ని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ వి పి రాజు పట్టణ, అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్ మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, మాజీ కౌన్సిలర్ గేదెల ఆదిబాబు, సతీష్, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మపురిలో ప్రచారం చేస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజు

మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ మృతి

ప్రజాశక్తి-బొబ్బిలి

మాజీ కౌన్సిలర్ సిరిపురపు సత్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందారు. సిరిపురపువీధికి చెందిన సత్యనారాయణ కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో సోమవారం ఉదయం మరణించారు. టిడిపి నుంచి రెండు సార్లు కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. సత్యనారాయణ మృతికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన, మాజీ మంత్రి సుజయకృష్ణ రంగారావు, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు సంతాపం తెలిపారు.

ప్రకృతి సాగు పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కుమ్మపల్లి గ్రామంలో ప్రకృతి సాగు పద్ధతిలో పండిస్తున్న పంటలను రైతు సాధికార సంస్థ ఇవిసి విజయ్ కుమార్ ఆధ్వర్యాన అమెరికా, కర్ణాటక బృందం సోమవారం పరిశీలించింది. వారితో డిపిఎం ఆనంద్ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ప్రకృతి సాగువల్ల కలిగే ప్రయోజనాలను సభ్యులకు వివరించారు. నవధాన్యాల సాగు, కషాయాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి రామారావు, రీజనల్ కోఆర్డినేటర్ కృష్ణారావు, ఆర్‌టిఎల్ ప్రకాశ్, ఆర్‌టిఒ హేమసుందర్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం దుంగాడ గ్రామంలో అమలవుతున్న ఫుడ్ బాస్కెట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విజయ్ కుమార్, ఎన్ఎఫ్ఎ జాహ్నవి కలిసి ఫుట్ బాస్కెట్ కార్యక్రమం అమలు గురించి అమెరికా బృందానికి వివరించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై వివరిస్తున్న డిపిఎం ఆనంద్

దుస్తులు పంపిణీ చేస్తున్న ఎస్ఇ లక్ష్మణరావు

ఘనంగా 1104 యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

74ఏళ్లు పూర్తి చేసుకొని 75 వ వసంతంలో అడుగుపెడుతున్న విద్యుత్ శాఖ ఉద్యోగుల 1104 యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. స్థానిక 1104 యూనియన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా యూనియన్ జెండాను సీనియర్ నాయకులు రాజేంద్ర ప్రసాద్ ఎగురవేశారు. అనంతరం వేడుకలను విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఎం.లక్ష్మణరావు ప్రారంభించారు. యూనియన్ ఏర్పడిన తరువాత ఉద్యోగులు అనేక హక్కులు సాధించుకోవడంతో పాటు, విద్యుత్ శాఖ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. యూనియన్ ఇన్నేళ్లు నడపడమంటే చిన్న విషయం కాదని, ఉద్యోగుల ఐక్య మత్యానికి నిదర్శనమని అన్నారు. అనంతరం కాంట్రాక్ట్,ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కు బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు నాగరాజు, జిల్లా కార్యదర్శి సురగాల లక్ష్మణరావు,డివిజనల్ అధ్యక్ష, కార్యదర్శులు అప్పారావు, దేముడు, పైడిరాజు, రమణ, రాము, మల్లేష్, శ్రీనివాస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ ఆలయ పునఃప్రతిష్ట

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని పోలిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పైడితల్లి అమ్మవారి ఆలయ పునప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా సోమవారం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు, సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, నాయకులు పతివాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీక్షలు చేపట్టారు. ఈ నెల 14న పునప్రతిష్ట కార్యక్రమం జరగనుంది.

స్టార్టప్‌ల ఏర్పాటుకు ముందుకు రావాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

విద్యార్థులు స్టార్టప్‌లు ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తే వారికి సెంచూరియన్ విశ్వవిద్యాలయం పూర్తి సహకారం అందిస్తుందని వైస్ ప్రెసిడెంట్ డి.ఎన్.రావు స్పష్టం చేశారు. సోమవారం ఇక్కడ 'సెంచూరియన్ కోడింగ్ క్లబ్'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగం సంపాదించడం గొప్ప కాదని, ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి వారు ఎదగాలని కోరారు. కోడింగ్ నేర్చుకున్న వారికి ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో అవకాశాలు ఉన్నాయన్నారు. ఛాన్సలర్ జి.ఎస్.ఎన్.రాజు, గ్రామ్ తరంగ్ ఎంప్లాయిబిలిటీ ట్రైనింగ్ సెంటర్ సిఇఒ బాబు శంకర్, వైస్ ఛాన్సెలర్ పి.కె. మహంతి మాట్లాడారు. కార్యక్రమంలో డీన్లు పిఎస్‌వి రమణారావు, ఎం.ఎల్.ఎన్. ఆచార్యులు, సన్నీ డియోల్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్.ఎస్.వర్మ పాల్గొన్నారు.

కుట్టు యంత్రాల పనివారలతో మాట్లాడుతున్న వైస్ ప్రెసిడెంట్ డి.ఎన్.రావు

గొలుసు దొంగకు ఆరు నెలలు జైలు

ప్రజాశక్తి - జామి

గొలుసు దొంగకు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ ఎస్. కోట న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. కేసు వివరాల్లోకి వెళితే... జామి మండలం లొట్లపల్లిలో స్కూలులో హెడ్ మాస్టారుగా పని చేస్తున్న పోల అరుణ కుమారి గత ఏడాది నవంబర్ 3న తన మోటారు సైకిలుపై వెళ్తూ అలమండ రైల్వే స్టేషను రోడ్డు సమీపంలో చేరేసరికి ఆమె వెనుకగా బైకుపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి, మెడలో బంగారు చైను తెంపుకొని పారిపోయాడు. ఆమె ఫిర్యాదు మేరకు జామి ఎస్ఐ వీరబాబు కేసు నమోదు చేశారు. కేసును ప్రతిష్టాత్మకంగా భావించి, దర్యాప్తు చేపట్టి, నేరాటానికి పాల్పడిన విశాఖపట్నం సిటీ కంచరపాలేనికి చెందిన భీమరసెట్టి కమలనాథ్ (37)గా గుర్తించి అరెస్టు చేశారు. దొంగిలించిన బంగారు చైను రికవరీ చేసి, కోర్టులో అభియోగం పత్రం దాఖలు చేశారు. కేసులో నిందితుడు తన నేరాన్ని అంగీకరించడంతో కోర్టుకు ఆయనకు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది.

బాల్య వివాహాలపై కళాజాతా

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని నందబలగలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణపై కళాజాత నిర్వహించారు. బుర్రకథ రూపంలో ప్రజలకు అర్థమైన రీతిలో భేటీ బచావో- బేటి పడావో, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అనే అంశాలపై అవగాహన కల్పించారు. చదువుకోవలసిన వయసులో పిల్లలకు వివాహాలు చేసి వారిని అనారోగ్యం పాలు చేయడం సరైనది కాదని తెలిపారు. బాడంగి ఐసిడిఎస్ పిఒ కె.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బిసి రిజర్వేషన్ సాధనే లక్ష్యం

ప్రజాశక్తి-భోగాపురం

ఉత్తరాంధ్రలో తెలగాలను ఒకే తాటిపైకి తీసుకువచ్చి బిసి రిజర్వేషన్ సాధించడమే లక్ష్యమని తెలగ సంఘం నాయకులు పల్లంట్ల వెంకట రమణ అన్నారు. తెలగాలను బిసిల జాబితాలోకి చేర్చాలని ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు పాదయాత్ర చేస్తున్నారు. దీనిలో భాగంగా ఆయన పాదయాత్ర సోమవారం భోగాపురం చేరుకుంది. ఈ సందర్భంగా భోగాపురం హనుమాన్ కూడలి వద్ద మాట్లాడారు. పాదయాత్ర ముగిసిన తరువాత భారీ బహిరంగ సభను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు పెద్దలు నిర్ణయించారని ఆయన తెలిపారు. అంతకుముందు టోల్‌గేటు వద్ద జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి లోకం మాధవి, ప్రసాద్ స్వాగతం పలికారు. అనంతరం సుందరపేట వద్ద వైసిపి యువజన నాయకులు సుందర హరీష్, గ్రామస్తులు స్వాగతం పలికారు. భోగాపురం చేరుకున్న తరువాత నాయకులు కొమ్మూరి సుభోషణరావు, పడాల శ్రీనివాసరావు, భాను, పల్లంట్ల శ్రీనివాసరావు తదితరులు ఆయనను సన్మానించారు. అనంతరం కాకర్లపూడి శ్రీనుబాబు, టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ తదితరులు ఆయనకు మద్దతు తెలిపారు. అక్కడ నుంచి పాదయాత్ర డెంకాడ మండలం బంటుపల్లి మీదుగా విజయనగరం చేరుకుంది.



పల్లంట్ల వెంకట రమణరావును సన్మానిస్తున్న భోగాపురం నాయకులు